క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు


గొట్లగట్టులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొనకనమిట్ల: బస్టాండ్ సెంటర్లో ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.మాధవరావు హెచ్చరించారు. శుక్రవారం గొట్లగట్టు గ్రామంలో ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డుపై, మార్జిన్లలో ఇష్టారీతిగా వాహనాలు, తోపుడు బండ్లు నిలిపి వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించొద్దని చెప్పారు. ఒకరికొకరు కలిసి మెలసి ఉండాలని ప్రజలకు సూచించారు. అనంతరం సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

రాచర్ల గేటును పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా రాచర్ల గేటు వద్ద రైలు వచ్చే సమయాల్లో గేటు మూతపడటం వల్ల ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో అనేకసార్లు స్థానికులు కోరారు. ఈ నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి ఎంతమేరకు స్థలం అవసరమవుతుందనే విషయంపై అధికారులతో చర్చించారు. వారి వెంట తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, రైల్వే శాఖ అధికారులు, జెడ్పీటీసీ బుడత మధుసూదనరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయం చేద్దాం.. సభ్యత్వం పెంచుదాం

పొదిలి: దివ్యాంగ రక్షక్ ఫౌండేషన్ సభ్యత్వం ముమ్మరం చేయడం ద్వారా సమాజానికి మరింత సేవ చేద్దామని ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు దేవళ్ల ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల చేయూతతో ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంతోపాటు, ప్రభుత్వ రాయితీలు, సౌకర్యాలు అందరికి చేరేలా కృషి చేద్దామన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు బ్రహ్మారెడ్డి, ఆంజనేయులు, రాధ, శ్రీను, గౌసియా, రంగలక్ష్మి, దుర్గాలక్ష్మి, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్‌లో కొత్త లైన్ వేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. చింతలపల్లె ఫీడర్ పరిధిలోని హనుమంతరాయునిపల్లె, కొత్తపల్లె, మలికేపల్లె, ఓబులాపురం, కూరాకువానిపల్లె, వర్ధనపల్లె, చింతలపల్లె గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పంట నమోదును పరిశీలించిన ఏఓ


పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ మెర్సీ

బేస్తవారిపేట: మండలంలోని పెద్ద ఓబినేనిపల్లెలో పంట నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, సున్నావడ్డీ, సబ్సిడీ విత్తనాలకు పంట నమోదుతో లబ్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అర్ధవీడు తహసీల్దార్


నూతన తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది


అర్ధవీడు (బేస్తవారిపేట): అర్ధవీడు మండల నూతన తహసీల్దార్‌గా కే దాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. యర్రగొండపాలెం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా అర్ధవీడు మండలానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు కలిసి నూతన తహసీల్దార్‌ను సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అక్తర్ నాయబ్, వీఆర్వోలు పాల్గొన్నారు.



హైసెక్యూరిటీ ఏర్పాటు చేయాలి

దేశంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల వద్ద హైసెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా వైద్యులు విధులు నిర్వహించే చోట, విశ్రాంతి తీసుకునే ప్రాంతాల్లో పోలీసు సెక్యూరిటీ కల్పించాలి. సెక్యూరిటీ లోపం వల్ల సాధారణ వ్యక్తులుగా లోపలికి ప్రవేశించి వైద్యులపై దాడులు, హత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఆస్పత్రిలో రోగుల అటెండెంట్లు కాకుండా బయట వ్యక్తుల సంచారాన్ని కట్టడి చేయాలి.

– డాక్టర్ అశోక్‌రెడ్డి, జీజీహెచ్, మార్కాపురం





మహిళా కానిస్టేబుల్‌ను నియమించాలి

రోజు రోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే మహిళా సిబ్బందికి రక్షణ కల్పించటం ఎంతో అవసరం. నైట్ డ్యూటీల్లో పనిచేసే సిబ్బంది రక్షణ కోసం లేడీ కానిస్టేబుల్‌ను నియమించాలి. అలా కాని పక్షంలో కనీసం మహిళా హోంగార్డులను అయినా నియమించగలిగితే నైట్ డ్యూటీలకు వెళ్లే మహిళా సిబ్బందికి ఎంతో ధైర్యంగా ఉంటుంది. దీంతో పాటు వైద్యశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం తాగి వైద్యశాలలో సంచరిస్తున్నారని సిబ్బంది ఫిర్యాదు చేస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి పటిష్ట సెక్యూరిటీ అవసరం.

– వి.నాగమహేశ్వరి, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్యకేంద్రం, పెద్దదోర్నాల

అవస్థల దారి.. నిత్య నరకం మరి!



చెరువుకట్ట రోడ్డుపై ఏర్పడిన గోతులు

- మార్కాపురం చెరువుకట్ట రోడ్డుపై గోతులు
- నిత్యం ఇబ్బంది పడుతున్న ప్రజలు

మార్కాపురం: మార్కాపురం నుంచి ఒంగోలు, అలాగే రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి అయిన చెరువుకట్ట రోడ్డుపై గుంతలు పడటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న చెరువుకట్ట రోడ్డుపై ప్రతి పది నిమిషాలకు పది ఆటోలు, సుమారు 20 బస్సులు, 50కి పైగా టూవీలర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. మార్కాపురం నుంచి ఒంగోలుకు, మార్కాపురం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారితోపాటు పలకల గనుల కార్మికులు, రాయవరం, గజ్జలకొండ, పోతలపాడు, బుడ్డపల్లి, గానుగపెంట, నాయుడుపల్లి, మన్నెంవారిపల్లి తదితర 15 గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఈ రోడ్డు మీదుగా వెళ్లాల్సిందే. సుమారు ఐదారు ప్రాంతాల్లో అడుగులోతు గుంతలు పడటంతో టూ వీలర్లు, ఆటో డ్రైవర్లు భయంతో వాహనాలను నడపాల్సి వస్తోంది. తరచూ రాత్రిపూట ఈ గుంతల్లో పడి పలువురు క్షతగాత్రులవుతున్నారు. ప్రధానమైన రహదారి కావడంతో గుంతలు పడినప్పటికీ తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నడూలేని విధంగా అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మొదటిసారిగా చెరువు కట్ట రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి లైట్లు వేయించడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు తగ్గాయి. అలాగే చెరువుకట్టపై ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి డ్రైవర్స్ కాలనీ చివరి వరకు రూ.5 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయించారు. కాగా పట్టణంలోని ఆకాశవాణి కేంద్రం వద్ద ఉన్న అలుగు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఎక్కువ సంఖ్యలో గుంతలు పడ్డాయి. మెట్ల వద్ద కూడా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జయహో ఇస్రో..

తర్లుపాడు: జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా చంద్రయాన్–3 ప్రాజెక్టు విజయ సూచికగా శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు భారీ రాకెట్ నమూనాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇస్రో సాధించిన విజయాలు, చంద్రయాన్–3తో భారత్‌కు కలిగే మేలు గురించి విద్యార్థులకు హెచ్‌ఎం సుధాకర్ వివరించారు. జంగంరెడ్డి కాలనీలో హెచ్‌ఎం మౌలాలీ ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రయాన్–3 రాకెట్ నమూనాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్రమశిక్షణే లక్ష్య సాధనకు ఆయుధం


విద్యార్థులకు బహుమతులిస్తున్న ప్రిన్సిపాల్ తారావాణి

పొదిలి: విద్యార్థులకు లక్ష్య సాధనకు క్రమ శిక్షణే ఆయుధమని హబీబుల్లా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కరీముల్లా బేగ్ మాట్లాడుతూ.. చదివిన కళాశాల, తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తేవాలని కోరారు. చదువును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమ సంస్థ ద్వారా మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తారావాణి, బీవీ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి


నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్న విద్యార్థినులు



గిద్దలూరులో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు, వైద్యులు

గిద్దలూరు రూరల్: వైద్యులకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషయనారెడ్డి అన్నారు. కోల్‌కతాలో విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని న్యాయవాదులు ర్యాలీగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై మానవమృగాలు హత్యాచారానికి పాల్పడటం దారుణమన్నారు. నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్యులపై ఈ విధంగా అమానుషంగా ప్రవర్తించిన వారికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సుధాకర్, న్యాయవాదులు మల్లికార్జున్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి హంతకులను కఠినంగా శిక్షించాలి

మార్కాపురం టౌన్: కోల్‌కతాలోని ఆర్.జి.కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్లో వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పోస్టుమార్టం ఆధారంగా నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో ఎంఎన్‌సీ కంపెనీల మాదిరి విద్యార్థులు, మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


ప్రగళ్లపాడు ఎంపీపీ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం జి చంద్రశేఖర్

పెద్దారవీడు: మొక్కలు పెంచడంతో పర్యావరణ పరిరక్షణ సాధించవచ్చని ప్రధానోపాధ్యాయుడు గుర్రపుసాల చంద్రశేఖర్ అన్నారు. అజల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలో ప్రగళ్లపాడు గ్రామం ఎంపీపీ, బద్వీడు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల, సానికవరం గ్రామం సచివాలయం, పొలాల్లో 500 మొక్కలు శుక్రవారం నాటారు. సర్పంచ్ మూల రమణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణం కాపాడుకోవాలంటే విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కే ప్రభుదాసు, హెచ్‌ఎం జీ వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి


లక్ష్మక్కపల్లిలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొమరోలు: ప్రకాశం పంతులు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాల హెచ్‌ఎం బీవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొమరోలు: ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల జనరల్, గొట్లగట్టు కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, నాయుడుపేట హిందూ పాఠశాలలో హెచ్‌ఎంలు సంజీవరావు, సురేఖ, విజయలక్ష్మి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.


చినారికట్ల జనరల్ పాఠశాలలో..

తర్లుపాడు: మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి సీఎంగా ఆయన చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

ఉపాధి పనులతో వలసలు తగ్గించండి


అక్కచెరువులో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి


గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటనాయుడు

కొమరోలు: గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలు తగ్గించాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు ప్రణాళిక రచించాలని కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు కోరారు. కొమరోలులోని గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ పనులు గుర్తించిన వెంటనే స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు. గత కొన్ని నెలలుగా ఉపాధి లేకపోవడంతో స్థానిక కూలీలు వలసలు వెళ్లే అవకాశం ఉందన్నారు. అనంతరం కొమరోలులోని గోపాలునిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో మంచినీటి కుళాయిల ద్వారా మురికినీరు వస్తోందని స్థానిక ప్రజలు జెడ్పీటీసీకి తెలిపారు. ఆయన స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దండు శశికళ, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీలు షేక్ సుభాని, తిరుపతిరాజు, ఈఓపీఆర్‌డీ షరీఫ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

పొదిలి రూరల్: ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం పొదిలి మండలంలోని అన్ని పంచాయతీల్లో సభలు నిర్వహించగా అక్కచెరువులో కార్యక్రమానికి తహసీల్దార్ హాజరయ్యారు. జాబ్‌కార్డు ఉన్నవారికి 100 పనిదినాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

మార్కాపురం రూరల్: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దరిమడుగులో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూలీలకు 100 పనిదినాలు కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, నీటి సౌకర్యం, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్ బట్టగిరి గౌతమి, ఎమ్మార్వో చిరంజీవి, వైద్యులు రోహిత్ నాయక్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనుల ఎంపికపై దృష్టి సారించాలి

కొనకనమిట్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించినట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు ప్రకాశం జిల్లా, మార్కాపురం టౌన్ కాపురస్తుడు **దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి** గారి కుమారుడు **మురళీధర్‌రెడ్డి** గారి వలన సంజ్ఞా యిషి పొంది యావన్మందికి తెలియజేయునది.

ఈ క్రింది షెడ్యూలు ఆస్తులు దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి మరియు నా క్లయింటుకు సంక్రమించిన జాయింటు కుటుంబ ఆస్తులు అయి ఉన్నవి. క్రింది షెడ్యూలు ఆస్తులలో నా క్లయింటుకు 1/3వ భాగం హక్కు కలదు. కాని నా క్లయింటు తండ్రి దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి నా క్లయింటుకు భాగం ఉన్న విషయం మధ్యపెట్టి షెడ్యూలు ఆస్తులను ఇతరులకు విక్రయించుటన్ను మరియు అప్పులు చేసి హామీగాను క్రింది షెడ్యూలు ఆస్తులను మొత్తం తనకు హక్కుగా ఉన్నట్లు చూపించుచున్నట్లు తెలియవచ్చినది. కావున్ని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఎవ్వరైన దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి వద్ద నుండి క్రింది షెడ్యూలు ఆస్తులకు నా క్లయింటు భాగమును మధ్యపెట్టి ఏరకమైన దస్తావేజు లను పొందినను అవి నా క్లయింటు హక్కును బద్ధపరచవని మరియు వారిపై క్రిమినల్ మరియు సివిల్ ప్రాసిక్యూషన్ జరుపబడునని ఖండితముగా తెలియజేయడమైనది. మరియు దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి చేసిన అప్పులతో నా క్లయింటుకు ఎలాంటి సంబంధంలేదని అవి తీర్చవలసిన బాధ్యత నా క్లయింటుకు లేదని మరి ముఖ్యంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా ఒంగోలు రి.డి. మార్కాపురం సబ్.డి. పెద్దారవీడు మండలం, తోకపల్లి గ్రామం మరియు రెవెన్యూ ఇలాకా..

1) సర్వే నెంబర్లు : 1) S.No. 4/1C విస్తీర్ణం AC 0-05 సెంట్లు, 2) S.No. 4/3A విస్తీర్ణం AC 0-78 సెంట్లు, 3) S.No. 5/1 విస్తీర్ణం AC 0-09 సెంట్లు, 4) S.No. 5/3A విస్తీర్ణం AC 6-35 సెంట్లు, 5) S.No. 5/3C విస్తీర్ణం AC 4-97 సెంట్లు, 6) S.No. 25 విస్తీర్ణం AC 3-49 సెంట్లు, 7) S.No. 21 విస్తీర్ణం AC 1-94 సెంట్లు, 8) S.No. 23 విస్తీర్ణం AC 1-52 సెంట్లు, 9) S.No. 3/1A, 3/1A2, 3/1C1, 3/1C3 లలో విస్తీర్ణం AC 3-06 సెంట్లు, 10) S.No. 4/1A విస్తీర్ణం AC 0-53 సెంట్లు, 11) S.No. 4/3C విస్తీర్ణం AC 0-54 సెంట్లు, 12) S.No. 26 విస్తీర్ణం AC 2-32 సెంట్లు, 13) S.No. 20/1, 20/2, 20/3 మరియు 20/4 లలో విస్తీర్ణం AC 6-23 సెంట్లు

(2) ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి. మార్కాపురం సబ్.డి. మార్కాపురం టౌన్ ఇలాకా ఇంటి నెంబరు 10–1052–L (సంజీవరెడ్డి నగర్) (3) పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామం ఇలాకా సర్వే నెంబరు 154/1,2,3,4 విస్తీర్ణం AC 3-36 సెంట్లు

M. Subba Reddy, Advocate. Markapur. Praksam Dist